

# గండి గడి

**యర్రమిల్లి విజయలక్ష్మి**

సాయంత్రం వేళ విశ్రాంతిగా కూర్చుని చదువుకుంటున్నాను. నిశ్శబ్దంగా వుండే చల్లని ప్రశాంత సంధ్యాసమయాలంటే నాకెంతో ఇష్టం.

ఉన్నట్లుండి వరండాలో సందడి వినిపించింది. చిన్న, చిన్న అడుగుల చప్పుడు, గుసగుసగా సన్నని మాటలు ఏకాగ్రత చెదిరింది.

"ఎవరూ?" అన్నాను విసుగుదల అణచుకుని.

"నేనేనమ్మా..." అంటూ వచ్చింది మస్తానమ్మ.

"ఏమిటే... ఈ వేళప్పుడొచ్చావు?" అన్నాను పుస్తకం తిరగేస్తూనే—

మస్తానమ్మ మా ఇంట్లో పని మనిషి. మనిషి సన్నగా, పీలగా వుంటుంది. చాలా ఆర్భకురాలు. ఒకప్పుడు బాగానే బతికిన వాళ్ళు కావడం వల్ల కష్టం చెయ్యడం అలవాటులేదు. ఇంట్లో సాగక పనిలోకి వస్తోంది. నాకు పనిమనిషి అవసరం కనుక పెట్టేసుకున్నాను. కానీ నాకు అలాంటి రోగిష్టిమారి మనుష్యులంటే చెడ్డ చిరాకు. నిండా పాతికేళ్ళైనా వుంటాయో - వుండవో కాని ఎప్పుడూ తుమ్ముతూ, దగ్గుతూ, ముక్కుతూ మూల్గుతూ వుంటుంది. ఎప్పుడూ ఏదో రోగంతో బాధపడుతూ ఈసురోమంటూ వుండే బక్కపీనుగులంటే నాకు మహా చెడ్డ విసుగు. కానీ తప్పదు కదా... పనిమనిషి లేకపోతే చాలా ఇబ్బంది. అందులో ఈ ఊళ్ళో పనిమనుష్యులకు ఎద్దడి. పొగాకు కంపెనీలో గ్రేడింగ్‌కో - పంట పొలాలలో రోజు కూలీకో పోతారు ఒంట్లో ఏ మాత్రం శక్తి - పనితీరు తెలిసిన పేద స్త్రీలు. అందువల్లే మస్తానమ్మ ఆకార వికారాలు పట్టించుకోకూడదనుకున్నాను.

"అమ్మగోరికి పిల్లోల్ని సూపిద్దామని తీసుకొచ్చాను" అంది గుమ్మంలో నిలబడి మస్తానమ్మ.

'ఏమిటో ... ఈవిడగారి సంతానాన్ని నాకిప్పుడు పనిమాలా చూపించకపోతే...' ఏమీ అనలేక చిన్నగా నవ్వి ఊరుకున్నాను. మనసులోని భావాలను చప్పున మాటల్లో బయటపెట్టలేని సంస్కారిని నేను.

సరే... పిల్లల కోడిలా వచ్చి హాల్లో నేల మీద కూర్చుంది మస్తానమ్మ. "ఈడేనమ్మా! పెద్దోడు సుదాకరం. సానా మెతకండి. మాటలు కూడా సరిగా రానేదు. ఈ ఎదవ పుటకలకే పెద్ద జబ్బు సేసిందండి. సచ్చి బతికానమ్మా!"

యథాలాపంగా పిల్లాడి వంక చూశాను. బక్కగా, వేరు పురుగులా తల్లిని పట్టుకు వేలాడుతున్నాడు. ఇక్కడికి తీసుకొస్తున్నందుకు లాగుంది - ఉతికిన చొక్కా, లాగు వేసింది. క్రాపు కూడా దువ్వి నట్టుంది. ముఖం శుభ్రంగా కడిగి తిలకం చుక్క కూడా పెట్టింది. పైపై అలంకరణ ఎన్ని చేసినా - అసలు రూపం ఏమైపోతుంది? వరి రోగిష్టిమారి వెధవని చూడగానే అర్థమైపోతుంది. మాల్ న్యూట్రిషన్... దానికే లేదు... ఇంక పిల్లలకేం పెడ్తుంది?

ముగురు పిల్లలు దానికి అప్పుడే... చిన్నపిల్ల ఆర్నెల్లుంటాయేమో. ఒళ్ళో వేసుక్కూర్చుంది. మిగతా ఇద్దరూ మొగపిల్లలు.

"అమ్మగోరికి దన్నమెట్రా సుదాకరూ..." అంది కొడుకుతో.

వాడింతింత కళ్ళతో — బిక్కు, బిక్కు చూస్తున్నాడు. తల్లి చెప్పింది అర్థం కాలేదు. అటు, ఇటు కుంటుతూ తిరుగుతున్నాడు.

"ఏడాదప్పుడు పెద్ద జొరమొచ్చి కాలు సీక్కుపోయిందమ్మా... ఎన్ని వైదగాలో సేసించాం... తగ్గనేదు."

పోలియోలాగుంది. కాలీడ్చుకుంటూ గదంతా కాసేపు తిరిగి పోయి సోఫాలో కూర్చున్నాడు.

మస్తానమ్మ లేచి వెళ్ళి "తప్పు.. ఈడ కూకో.." అని లాగి క్రింద కూర్చోబెట్టింది.

రెండోవాడు పెద్దాడి కంటే కాస్త మెరుగ్గానే వున్నాడు. చురుగ్గా కూడా కనిపిస్తున్నాడు. బల్లమీద బొమ్మల్ని అటు, ఇటు కుదుపుతున్నాడు. 'అయ్యన్నీ తాక్కూడదు.. తప్పు.. దివాకరూ.. ఈడ కూకో!'

"వీడి పేరు దివాకర్‌లాగుంది. మంచి పేర్లే పెట్టావు" అన్నాను నవ్వు తెచ్చుకుని.

"ఈ పిల్ల పేరు ... జోతి ... ఆల్ల నాన్నకి పిల్లంటే పాణమండి. ఈల్లని బాగా సదివించాలని..." మస్తానమ్మ ఒళ్ళో నిద్రపోతున్న పిల్ల తల మురిపెంగా నిమిరి అంది గొప్పగా—

'బాగానే వుంది. సంబడం... ముందు వాళ్ళకి కడుపు నిండా తిండి పెట్టు.. చాలు.. తమ స్థితిగతులు చూసుకోకుండా పిల్లల్ని ఏదో గొప్ప వాళ్ళని చేసెయ్యాలని అందరికీ ఆశే...' నిరసనగా అనుకున్నాను. దుమ్ము కొట్టుకున్న కాళ్ళతో ఇల్లంతా తెగ తిరుగుతున్నారు మురికి మనుష్యులు... నీడలు తేలే మొజాయిక్ మకిలౌతుందని నా భయం.

"అల్లరి చేకూడదు! పదండి పోదారిక" మస్తానమ్మ పిల్లల్ని తీసుకుని లేచింది.

రెండ్రోజులు పోయాక మళ్ళీ తల్లితో వచ్చాడు — అది "పో...

పోయి... తమ్ముడితో ఆడుకో'' అంటున్నా అర్థం కాదు వాడికి. మా డాలీ చుట్టు చుట్టు తిరుగుతాడు. దాని తోక పట్టుకోబోతాడు. చిత్రం! అందరినీ చూసి గుర్రు, గుర్రు మంటుంది. దగ్గరికి రానియ్యదు. అలాంటిది వాడ్నేమీ అనలేదు. దానితో పాటు వాడికీ బిస్కెట్ ఇచ్చాను. వాడి కేదో ఒకటి తిండి పెట్టడానికి నాకేం అభ్యంతరం లేదు కానీ... వాడల్లా చొంగ కారుస్తూ — గుమ్మానికి అంటుకుని గుడ్లేసుకుని చూస్తుంటే నాకు మహా అని శ్రాంతిగా వుంటుంది. 'ఒక మూలకు పోయి కూర్చుని తినరా' అంటే, పోడు — తల్లి కేకలేసినా అర్థం కాదు.

"సిద్నెందుకే.. రోజూ కూడా తెస్తావు? పని చేసుకోనివ్వడు'' అని కసురుకుంటే మస్తానమ్మ జాలిగా చూసి— "ఏం సేమంటారమ్మా! ఎన్ని సాళ్ళు సెప్పినా ఇనకోడు. సిన్నోడు ఇమ్మానికెళ్ళిపోతాడు. పిల్ల నిద్దరోద్ది... ఈడేనమ్మా కూడా పడ తాడు'' అంటూ మొదలెడుతుంది సోది. దానితో సంభాషణ కొన సాగించడమంటే... పెద్ద తలనెప్పి. కదిపితే చాలు...

"సరి..సరి.. పని కానియ్యి'' అని మాటలు తుంచేసి అక్కడ్నించి వెళ్ళిపోతాను.

ఆ రోజు పనిలోకి మస్తానమ్మ ఒక్కతే వచ్చింది. అనిటి నెధవ కూడా రాలేదు. నా మనసుకి చాలా హాయనిపించింది. మస్తానమ్మ అదోలా, దిగులుగా కనిపించింది. 'ఏమిట'ని అడగాలంటే భయం నాకు. ఆకలి, దరిద్రం, కన్నీళ్ళు, రోగాలు ... కథలు చెప్తుంది. పది రూపాయలు కావాలంటే పారెయ్య గలను కానీ.. అవన్నీ వినే సహనం లేదు... అందుకే 'ఏమిటే అలా వున్నావు?' అని నాకు నేనుగా కదప లేదు. మస్తానమ్మ గబ, గబ పని ముగించుకుని "నత్తానమ్మగోరూ - పెద్దోడ్ని ఆసుపత్రికి తీసుకెళ్ళాల. రేత్తిరి కాడ్నించి ఒకటే జొరం'' అని వెళ్ళిపోయింది. నేనా విషయం పట్టించుకోకుండా నా పనిలో మునిగి పోయాను.

తరువాత ఏదో ఒక సమయంలో వచ్చి నా కిబ్బంది లేకుండా పని చేసుకుపోయింది మస్తానమ్మ. దానిలో వున్న సుగుణం అదే — ఎట్టి పరిస్థితి లోనూ నాగా పెట్టదు.

"ఏమిటే.. ఓ వేళా, పాళా లేకుండా నీ ఇష్టం వచ్చినప్పుడు వస్తు న్నావ్...'' అని గదమాయించాను.

"పిల్లోడి కసలు బాలేదమ్మా...'' అంటుంటే దాని కళ్ళలో తడి - ఎంతైనా పాపం, తల్లి కదా...

"మరి మందిప్పించడం లేదూ.''

"పెద్దాసుపత్రిలో చూపిత్తన్నా దాయన. ఏవో గోలీలు, అరకు ఇచ్చా రమ్మా. తగ్గనేదు.. సరిచ్చలెయ్యో సెయ్యాలంట'' చిరిగిన కొంగుతో ముఖం తుడుచుకుంటూ అలసటగా అంది.

"ఊ .. మరి చేయించలేక పోయావా.. డబ్బేమన్నా కావాలంటే తీసుకో. తరువాత చూసుకో వచ్చులే'' మానవత్వం ఊరుకోలేక పోయింది.

మస్తానమ్మ కృతజ్ఞతగా చూసి - నిట్టూర్చింది.

"ఆళ్ళ నాన కూడా సనిసేసే కాడ ముందే పుచ్చేసుకున్నాడం టమ్మా. ఈడి వైదిగం కోసం.. ఈ సైసలు కూడా ఆడికే కర్సెట్టేస్తే మిగతోళ్ళకి కూడెట్టాలమ్మా. ఈడి పుటకలకి నా కెంతో జబ్బు సేసింది. ఆడసలే బతకడనుకున్నారు. అట్టాటిది ఇద్దరం బతికి 'ఆడి' పాణాలు తోడేత్తన్నాం. సచ్చినా బాగుండి పోయేది''

మస్తానమ్మ మాటాడుతుంటే వచ్చింది — నా ఫ్రెండ్ ఇందిర. "రా..రా — ఏమిటే... ఇంత అక స్మాత్తుగా వచ్చావు? వెల్‌కం.. వెల్‌కం..'' ఆనందపడిపోతూ ఆహ్వా నించాను.

'మా కల్చరల్ అసోసియేషన్ ఈ ప్రాంతంలో ఒక మెడికల్ క్యాంప్ కండక్టు చేస్తోంది రెండ్రోజులు. నువ్వున్నావని గెస్ట్‌హౌస్‌లో దిగకుండా ఇటు వచ్చేశాను...'' అంది ఇందిర. అది గుంటూరులో మెడికల్ ప్రాక్టీష నర్.

## కార్టూనుకు మంచి జోక్ వ్రాయండి

ఇక్కడ ప్రచురించిన కార్టూన్‌కు నవ్వు పుట్టించే ఒక చక్కని జోకు ఆలోచించి వ్రాయండి.



మాకు వచ్చిన జోక్స్ నుండి ఉత్తమంగా ఎన్నికయిన జోక్‌కు రూ. 50/- బహుమతిగా అందజేస్తాము.

జోక్‌ని ఒక పోస్ట్ కార్డుపై వ్రాసి 'కార్టూన్ జోక్ శీర్షికకు' ఎడిటర్, వనితా జ్యోతి, ఆంధ్ర జ్యోతి బిల్డింగ్స్, లబ్బీపేట, విజయవాడ-520 010 చిరునామాకు ఈ నెల 10వ తేదీలోగా అందేలా పంపించాలి.

—ఎడిటర్

### 'కార్టూన్ జోక్ శీర్షికకు' ఎన్నికయిన జోక్


ప్రియుడు: ఇన్నాళ్ళూ నాకు మంచి 'కంపెనీ' ఇచ్చినందుకు థాంక్స్ డార్లింగ్! అన్నట్లు, నీ పెళ్ళికి నన్ను తప్పకుండా పిలుస్తావుగా?!

ప్రేయసి: ?!? వాట్ ?!?

ఉజ్వల ప్రసాద్,
రామవరం - 507 118



ఈ శీర్షికకు పాఠకులు ఉత్సాహంగా జోక్స్ వ్రాసి పంపారు. వారందరికీ అభినందనలు. క్రిందటి నెల ఇచ్చిన కార్టూన్‌కి మాకు వచ్చిన జోక్స్‌లో ఈ క్రింది జోక్ బహుమతికి ఎన్నికయింది. వీరికి బహుమతి సొమ్ము అంద జేస్తాము.



యువకళా వాహిని ఉజ్వల సంయుక్తంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ అవార్డులు పొందిన కుమారి శోభానాయుడు, శ్రీమతి సరిదే మాణిక్యమ్మ, డా. చిట్టిబాబులను సత్కరించిన డా. అక్కినేని



ఇటీవల రవీంద్ర భారతిలో 'తన్మయి' సంస్థ కుమారి సి.హెచ్. విజయలక్ష్మి (భరతనాట్యం)ని సత్కరించిన సందర్భంగా ఆమెకు జ్ఞాపిక బహూకరిస్తున్న అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ శ్రీ టి.యస్. రావును చిత్రంలో చూడవచ్చు

"మంచి పని చేశావు. ఆ .. మస్తానమ్మా.. వేణ్నీళ్ళు పెట్టు.. స్నానం చేస్తుంది... పదవే.. ముందు కాస్త కాఫీ తాగుదుగాని.."

ఇద్దరం మాటల్లో పడ్డాం. ఇందిర ప్రోగ్రాం విశేషాలు మరికొంత వివరంగా తెలిసాయి.

"అయితే.. మా మస్తానమ్మ కొడుకుని కూడా కాస్త పరీక్ష చేయించవే ఇందిరా... పాపం...!" అన్నాను అప్రయత్నంగా. ఇంకేం ఇందిర నన్ను వదిలేసి మస్తానమ్మ కొడుకుని గురించిన ఆరాల సేకరణలో మునిగిపోయింది.

"సరే.. సాయంత్రం నాలుగింటికి ఆడపిల్లల కాలేజి దగ్గరికి పిల్లాణ్ని తీసుకురండి.. అక్కడే డాక్టర్లు ఆడవాళ్ళని - పిల్లల్ని పరీక్షించి మందులిస్తారు" అంది ఇందిర.

"ఎందుకే సాంఘిక సేవంటూ ఈ తిరుగుళ్ళు. ఇంకా ఎన్నాళ్ళు" అన్నాను.

ఇందిర నవ్వి ఊరుకుంది. మొదట్నించీ దాని తీరే అంత. తను మంచి అనుకున్నది ముందు వెనుక చూడకుండా ఆచరిస్తుంది. తనలో ఏమాలించుకుంటుందో ఏమో... ఎవరితోనూ సంప్రతించడం - సలహాలు తీసుకోవడం లాటివి చెయ్యదు. నా ప్రపంచం వేరు - ఆలోచనలు వేరు. దాని విధానాలు, ఆశయాలు వేరు. అయినా మొదట్నించీ ఇద్దరం స్నేహితులుగానే వుంటున్నాం.

సరే సాయంత్రం మస్తానమ్మ కొడుకుని కూడా డాక్టర్లు పరీక్షించారు. ఇందిర మూలంగా మరింత శ్రద్ధగా మందులు, టానిక్కులు ఉచితంగా ఇచ్చారు. ఇందిర కోసం నేనూ కాసేపు అక్కడ వున్నాను. దూరంగా నించుని ముఖం చిట్లించి అంతా చూస్తున్నాను. ఉదయం నుండి పరీక్ష చేయించుకోవడానికి చుట్టుప్రక్కల ఊళ్ళలోని పేద స్త్రీలు, పిల్లలు వస్తూనే వున్నారు. నిర్విరామంగా డాక్టర్లు, నర్సులు పరీక్షలు చేస్తూనే వున్నారు. విసుగు లేదు, జుగుప్స లేదు. అయిష్టం - అసహనం లేదు. రోగుల దృష్టిలో వాళ్ళు సాక్షాత్తు దైవ స్వరూపాలే. దయగా చూస్తూ - మెత్తని మాటలతో ధైర్యం చెప్తూ దీన మానవ సేవ చేస్తున్న వాళ్ళ పట్ల పేదవాళ్ళ చూపుల్లో ఎంత కృతజ్ఞతో - ఎంత భక్తి, గౌరవాలో—

"ఆ ఏరా.. ఎలా వున్నావు?.. గుడ్.. జ్వరం లేదుగా.." మస్తానమ్మ కొడుకుని దగ్గరకు తీసుకుని పరీక్షిస్తూ అంది ఇందిర.

"రేత్తిరి నిద్దరబోయాడమ్మా... కూసింత రొట్టె, పాలు తాగాడు. అమ్మగోరూ తమ దయమ్మా.. పిల్లోడు ఏమైపోతాడోనని బయపడ్డానండి" మస్తానమ్మ నీళ్ళు నిండిన కళ్ళతో కృతజ్ఞత చెప్పింది.

"తగ్గిపోతుంది.. కానీ ఇంకా కొంత వైద్యం చేయించాలి. బలానికి మందులివ్వాలి. పట్నంలో ఇలాటి పిల్లల కోసం ప్రత్యేకమైన ఆశ్రమాలున్నాయి. నువ్వు అక్కడికి పంపుతానంటే ఆ ఏర్పాట్లు నేను చేస్తాను. పిల్లాడి బాగోగులు కూడా వాళ్ళే చూస్తారు. లేనివాళ్ళకే ఆ సదుపాయం వుంటుంది. నీడి భవిష్యత్ కూడా చక్కగా కుదురయ్యేట్లు చూస్తారు. ఇక్కడ నీ వల్ల కాదు... ఏమంటావ్?" అంది ఇందిర. మస్తానమ్మ ఇందిరకు దణ్ణం పెట్టి "అట్టాగేనమ్మా" అంది వెంటనే.

"అదేనిటే.. నీ ఆయన్నడగొద్దా" అన్నాను ఆశ్చర్యంగా.

"ఆడు మాత్రం ఏటంటాడమ్మగోరూ. పిల్లోణ్ణి కన్నామే గాని బాగోగు ఏం సూత్తన్నామమ్మా. మీ బోటి దయగల తల్లులే ఆడ్ని ఆదుకోవాల. మేమేటి సేగలం తల్లీ... అట్టాగేనమ్మా. ఏడైనా ఆడు బాగుండడమే గావాల!" అంది మనస్ఫూర్తిగా.

"ఏమిటే.. ఎందుకు నీకీ గోలంతా?" అన్నాను ఇందిరతో. అది సన్నగా నవ్వి ఊరుకుంది. "ఆ తృప్తి నీ కర్థం కాదులే. తెలియాలంటే నువ్వూ కృషి చెయ్యాలి.. వద్దొద్దు.. అలా చూడకు! పోనీ.. ఇదిగో ఈ పిల్లాడి వైద్యం కోసం నువ్వు కొంత డొనేట్ చెయ్యాలి సరేనా.. ఇక పడుకో.. పొద్దున్నే నా ప్రయాణం" అంది కళ్ళు మూసుకుని.

"డబ్బివ్వడానికి నా కేం అభ్యంతరం లేదుకానీ.. ఏమిటే నీకీ వెర్రి" సన్నని చిరునవ్వు కాంతితో ప్రశాంతంగా వున్న ఇందిర నిర్మల వదనం నాకేదో సందేశమిస్తున్నట్లుంది లోలోన ఏవో ఆలోచనలు.. కొత్తగా. ●

చిత్రం: ఎస్. ప్రసాద్

